




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -6-

వ్రాసిన సాహిత్యంలోనూ, సాగించిన జీవితంలోనూ ఎప్పుడూ వివాదాలకు కేంద్ర బిందువుగానే జీవించిన ఇరవయ్యవ శతాబ్దపు సంచలన రచయిత, అభిమానులకు ప్రేమర్షి, గిట్టని వాళ్లకు అంటారని వాడు చలం.. గుడిపాటి వెంకట చలం.!!

16 సంవత్సరాలు వయసు వచ్చేసరికి చలానికి వివాహ ప్రయత్నాలు ప్రారంభించారు. చలం గారు వద్దన్నారు. మొదటి కారణం.. ఆయన పెద్ద చెల్లెలు పేరు అమ్మణ్ణి. ఆమెను చెల్లెలు అనేకంటే, స్నేహితురాలు అనొచ్చు. ఆమెకు 11,12 సంవత్సరాలు ఉండగానే పెళ్లి ప్రయత్నాలు ప్రారంభించారు. నిశ్చయం కూడా చేశారు. పెళ్ళికొడుకు రావడం, పెళ్లి రోజు కూడా ఖరారు అయిపోయింది. పాపం, ఆ చెల్లెలు ఏడవడం ప్రారంభించింది. "అన్నయ్యా!ఎలాగైనా ఈ పెళ్లి తప్పిపోయేలాగా చెయ్యి. నాకు ఇష్టం లేదు. నేను చదువుకుంటాను."అని, తన గోడు వెళ్ళ బుచ్చింది. అయితే, చలానికి 15,16 సంవత్సరాల వయసు మాత్రమే. ఏం చేయగలడు? పెద్ద వాళ్ళను ఎలా ఎదిరించ గలడు? నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు. పెళ్లి రోజు వచ్చింది. ఆ పెళ్ళికొడుకు గుర్రం మీద వస్తున్నాడు. ఎవ్వరూ

ఆపలేకపోయారు. చెల్లెలు కంటికీ, మింటికీ ఏకధారగా ఏడుస్తున్నది. చలంగారూ, మిగతా చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ ఏడుస్తున్న అమ్మణ్ణి చూశారు. అప్పుడు చలంగారు అనుకున్నారు 'ఇది పెళ్ళా?ఇంత చిన్న వయసులో, ఏమీ తెలియని వయసులో, పది సంవత్సరాలు కూడా నిండని వయసులో పెళ్లిచేస్తున్నారు. దీనివలన తరువాత ఏ సమస్యలు వస్తాయో?' అంత చిన్న వయసులో అలా ఆలోచించారు గానీ, ఏమీ చెయ్యలేని నిస్సహాయత. "ఎంతో దుర్మార్గుడైన మా నాన్న కూడా దీన్ని ఆపలేకపోయాడు. మా తాత గారు కూడా ఈ పెళ్లి కొడుకు గురించి తన డైరీలో రాసుకున్నారు. 'వీడు చదువుకొన్న గాడిద లాగ వున్నాడు' "అని.

ఆ సంఘటన చలంగారి మనసు మీద తీవ్ర ప్రభావాన్ని చూపించింది. అంత చిన్నవయసులో పెళ్లి చేసుకుంటే, ఆడపిల్లలు యెంత బాధ పడతారు అనేది. రేపు నాకు వివాహం అయితే, నాకు వచ్చే అమ్మాయికూడా ఇలాగే బాధ పడుతుంది కదా !"అని మనసులో మెదిలింది. అదొక కారణం.

రెండో సాహసం. వాళ్ళ పెదనాన్న కొమ్మూరు నరసింహారావు గారు కాకినాడలో వుంటారు. ఆయనకు ఇద్దరు అమ్మాయిలు. మగపిల్లలు కూడా ఉన్నట్లున్నారు. పెద్దమ్మాయి పేరు కమల. రెండో అమ్మాయి పేరు రమణ. చలంగారు సెలవుల్లో కాకినాడ వెళ్ళేవారు. ఆ ఆడపిల్లలు కూడా తెనాలి వచ్చేవారు. ఏమైందో కానీ చలంగారికి వరుసకు సోదరి అయ్యే రమణ మీద ప్రేమ పుట్టింది. ప్రేమ పుట్టడమే కాదు. పెళ్లి చేసుకుంటానని అన్నారు. చెల్లెలు వరస అయ్యే అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని అనడం, చాలా తీవ్రమైనటు వంటి ప్రతిపాదన. ఇంట్లో వాళ్ళందరూ నానా తిట్లు తిట్టారు. "ఏమిటి?నీ వెర్రి వెయ్యి తలలు వేస్తున్నది.ఆ అమ్మాయి నీకు వరసకు చెల్లెలు అవుతుంది. ఆ అమ్మాయిని చేసుకోవడం ఏమిటి?"
అంతటితో ఊరుకున్నారా? ఆ వయసులోనే తిరుగుబాటుతనం అలవాటయ్యింది. శృంగేరీ పీఠం వాళ్లకి ఒక వుత్తరం రాశారు. "నేను మా పెదనాన్న కూతురుని ప్రేమించాను. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుందామని అనుకుంటున్నాను."అని. వాళ్ళమీ సమాధానం రాయలేదు

పెద్దవాళ్ళు, 'వీణ్ణి ఇలాగ వదిలేస్తే గనక ఇంకెన్ని ఆలోచనలు వస్తాయో, ఎలాంటి పనులు చేస్తాడో, అందుకని వెంటనే పెళ్లి చేసెయ్యాలి'అనుకొని మెడలు వంచి "వుప్పలూరి రంగనాయకమ్మ"గారి తోటి పెళ్లి చేసేశారు. ఈ వుప్పలూరి రంగనాయకమ్మ గారు ఎవరో తెలుసుకోవాలంటే మనం బెజవాడ వెళ్ళాలి.

వుప్పలూరి రామశేషయ్య గారని బెజవాడలో ఒక ధనవంతుడు వున్నాడు. ఆయన ఇంపీరియల్ బేంక్ మేనేజర్ గా ఉండేవాడు. ఆరోజుల్లోనే ఆయన జీతం 110 వుండేది.ఆయన మొదటి భార్యకు ఒక అమ్మాయి.ఆమె చనిపోయాక రెండవ వివాహం చేసుకున్నాడు.ఈ రెండో భార్యకు ఇద్దరు అమ్మాయిలు.

విచిత్రం ఏమిటంటే, ఆ రామశేషయ్యగారు ముగ్గురు అమ్మాయిలకీ ఒకే పేరు "రంగనాయకమ్మ" అనే పెట్టారు. మొదటి భార్యకు పుట్టిన రంగనాయకమ్మ, పెద్ద రంగనాయకమ్మా. రెండో ఆమె చలంగారి వదిన రంగనాయకమ్మ. మూడో రంగనాయకమ్మ, చలంగారి భార్య గారు. ఆ మొదటి, రెండో రంగానయకమ్మలు బాల్యంలోనే వితంతువులు.

దానికి కారణం కథలుగా చెప్పుకునేవారు. ఈ రామశేషయ్య గారి దగ్గర ఒక గుమస్తా ఉండేవాడు. ఆయన రకరకాల ఎత్తులు వేసి, రామ శేషయ్యగారి ఆస్తంతా కొట్టెయ్యడానికి, ఇంటికి వచ్చిన కొత్త అల్లుళ్ళకి ఆయనే విషం పెట్టాడని ఆ రోజుల్లో కథలుగా చెప్పుకునేవారు. ఆ విధంగా పెద్ద అల్లుళ్ళు ఇద్దరూ కూడా మామగారి ఇంట్లోనే చనిపోయారు. దాంతోటి పెద్దమ్మయిలు ఇద్దరూ వితంతువులు అయ్యారు. ఆ తరువాత పెద్ద రంగనాయకమ్మగారికి నైజాం లో ఎవరికో ఇచ్చి, మళ్ళీ వివాహం చేశారు. చాలా రోజులు ఆమె హైదరాబాద్ లోనే వుండేవారు. రెండో రంగనాయకమ్మగారు చలంగారితో పాటు జీవితాంతం వున్నారు. ఈమెనే చలంగారు 'ఒయ్యి' అని రాస్తుంటారు.

ఇక 3వ రంగనాయకమ్మగారు చలంగారి భార్య అనుకున్నాం కదా! ఆమెని ఇంట్లోవాళ్ళు "చిట్టి రంగనాయకమ్మ" అనే వాళ్ళు. తేడా తెలియడానికి. చలంగారికి ఆ 'చిట్టి' అనడానికి కూడా బద్ధకమే. "టి"అని గానీ, 'చిట్టి' అని వుంటేఆయన భార్య గురించి రాసినట్లు. చలం గారు మొత్తం ఆత్మకథలో గానీ, మ్యుజింగ్స్ లో గానీ ఎక్కడైనా భార్య గారి ప్రస్తావన వస్తే, "రంగనాయకమ్మగారు" అనే రాశారు. ఎక్కడా కూడా ఏకవచన సంబోధన చెయ్యలేదు. వుప్పలూరి రామ శేషయ్య గారి మూడో అమ్మాయిని, చలం గారికి ఇచ్చి, 1910 ప్రాంతాల్లో వివాహం చేశారు. ఆయన హైస్కూలు చదువు కూడా1911లో పూర్తయ్యింది. అప్పటికి ఆయనకు 16,17సంవత్సరాల వయసు వచ్చింది. పై చదువులకు అంటే ఎఫ్.ఎ చదవడానికి కాకినాడ పంపించారు. కానీ, రంగనాయకమ్మగారని కాపరానికి పంపించలేదు. అప్పటికి ఆమె ఇంకా చిన్న పిల్లే కాబట్టి, తీసుకొచ్చి తెనాలిలోనే ఉంచారు.

చలంగారి కాకినాడ జీవితం ఆయన లోని మరో మనిషిని వెలుపలికి తీసింది. చలంగారిలో పూర్తి మార్పుకి కారణం అయింది. అదెలా జరిగిందో తెలుసుకోవడానికి ముందు, అప్పటి కాకినాడలో ఉన్నటువంటి పరిస్థితులు తెలుసుకోవాలి. అదేమిటంటే, ఒక వ్యక్తి గురించీ, ఒక ఉద్యమం గురించీ.

ఇది 1911 ప్రాంతం. ఆ వ్యక్తి పేరు రఘుపతి వెంకటరత్నం నాయుడు. ఆయన ప్రముఖ విద్యా వేత్తా, సంఘ సంస్కర్త. ఎటువంటి వివాదాలు లేకుండా అందరితోనూ గౌరవాలు అందుకున్న వ్యక్తి. ఆయన

కాకినాడ దగ్గర పిఠాపురం రాజావారి కాలేజిలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నారు. ఆయన ఆ రోజుల్లోనే ఆడపిల్లలూ, మగ పిల్లలూ కలసి చదువుకునే కో–ఎడ్యుకేషన్ ప్రారంభించారు. ఇది మొదటి విషయం.

రెండో విషయం. ఉద్యమం గురించి. ఆ వుద్యమం పేరు "బ్రహ్మ సమాజ ఉద్యమం" ఈ బ్రహ్మ సమాజం గురించి క్లుప్తంగా చెబుతాను. ఎందుకంటే, ఈ బ్రహ్మ సమాజమే చలం గారిని మరో మనిషిగా మార్చేసింది. అందువల్ల దాని పునాదులు గురించి క్లుప్తంగా తెలుసుకోవాలి. ఈ బ్రహ్మ సమాజం అనేది ఒక సరికొత్త ఆలోచనా ధోరణినీ, కొత్త జీవిత విధానాన్నీ ప్రతిపాదించింది. దీనిని బెంగాల్ లో 'రాజా రామ్ మోహన్ రాయ్' ప్రవేశపెట్టారు.

ఈ బ్రహ్మ సమాజం ముఖ్యంగా చెప్పేదేమిటంటే... దేవుడుకి ఇన్ని అవతారాలు లేవు. వున్నది ఒకటే దేవుడు. అతడినే మీరు ఈశ్వరుడు అనుకోండీ, బ్రహ్మ అనుకోండీ. "ఏకేశ్వరో పాసన" పద్ధతిలో ఆ కనిపించని దేముడిని ప్రార్ధిస్తాము. అతనికి రూపం అంటూ ఏమీలేదు. అందుకని విగ్రహారాధనను మేము నమ్మము. ఇది ఆ బ్రహ్మ సమాజం యొక్క మూల సూత్రం. అంతే కాక, ఈ బ్రహ్మ సమాజం కొన్ని నియమాలూ, కొన్ని సామాజిక విషయాలను కూడా జత చేసి, బాల్య వివాహాలను వ్యతిరేకించడం, వితంతు వివాహాలను ప్రోత్సహించడం, కులబేధాలను నిర్మూలించడం, అలాగే నీతిగా,నిజాయితిగా, సచ్ఛీలతతో జీవించడం ఇలాంటి వాటినన్నిటినీ కలిపి, తెలుగుదేశంలో బ్రహ్మ సమాజం యొక్క భావాలను విస్తృతంగా ప్రచారం చేసిన వాళ్ళలో, "కందుకూరి వీరేశలింగం" గారు మొట్ట మొదటి ప్రముఖుడైతే, రెండవ ప్రముఖుడు ఇప్పుడు మనం చెప్పుకుంటున్న "రఘుపతి వెంకట రత్నం నాయుడు"

వీరేశలింగంగారి అడుగు జాడల్లోనే, వెంకటరత్నంనాయుడు గారు కూడా అనాధ శరణాలయాలు స్థాపించి, పతితులనూ, భ్రష్టులనూ ఆదరించి, వాళ్లకు పునరుజ్జీవనం కలిగించడంలో ప్రముఖమైన పాత్ర వహించారు. వీరేశలింగంగారి కార్య క్షేత్రం  రాజమండ్రి అయితే, నాయుడుగారి కార్యక్షేత్రం కాకినాడ. ఆయన ఆధ్వర్యంలో కాకినాడలో బ్రహ్మ సమాజ ప్రభావం రోజు రోజుకీ అధికమవుతున్న సమయంలోనే చలంగారు కాకినాడలోని కాలేజిలో చేరారు. ఇది నేపథ్యం.

చలంగారు కాకినాడ వెళ్ళగానే, కొన్నాళ్ళ పాటు వాళ్ళ పెదనాన్నగారు కొమ్మూరు నరసింహంగారి ఇంట్లో కొన్నాళ్ళు వున్నారు. వాళ్ళ పెద్దమ్మాయి కమల. వీళ్ళ చిన్నమ్మాయినే గతంలో పెళ్లి చేసుకుంటానని గొడవ చేసింది. ఆ కమలకు వివాహం అయింది. ఈమె "తన భర్త కొడుతున్నాడనీ, తిడుతున్నా డనీ, నన్ను ఎలాగైనా కాపాడమనీ" చలం గారిని అడిగేది. అయితే, మళ్ళీ భర్త దూరంగా వెళ్తే.."నా భర్త ఎక్కడ ఉన్నాడో, వెతికి తీసుకురా! అన్నయ్యా"అనేది. ఇవన్నీ గమనించారు. ఇక్కడ

వుంటే కూపస్థ మండూకం అయిపోతాను. ప్రపంచం తెలియాలంటే, బయట వుండాలి. అనుకొని, పెద్దనాన్న ఇంటినుండి కాలేజీ హాస్టల్ కి వెళ్లారు.

అక్కడకు వెళ్ళగానే కొత్త జీవితం, కొత్త మిత్రులూ కనిపించారు. ఆ కొత్త మిత్రులలో ఆయన మీద చాలా ప్రభావం చూపించిన మిత్రుడు ...ఆ తరువాత రోజుల్లో హరిజన సేవకుడిగా ప్రసిద్ది పొందినటువంటి "తల్లా ప్రగడ ప్రకాశ రాయుడు". అతను కూడా చలం గారితో పాటు ఎఫ్.ఎ. మొదటి సంవత్సరంలో వున్నాడు. ఆయన మంచి మిత్రుడు అయ్యాడు. రోజూ సాయంత్రం పూట షికార్లు వెళ్ళేవారు. ఒకరోజు వీళ్ళు బయటకు షికారు వెళ్లి వస్తుంటే, మరో మిత్రుడు కనిపించాడు. ముగ్గురూ కలసి హాస్టల్ కి వచ్చారు. ఆ మూడో మిత్రుడు "భోజనం టైమయ్యింది. నేను వెళ్తాను"అన్నాడు. "అయ్యో! వెళ్ళిపోవడం ఎందుకు?హాస్టల్లో భోజనం చేద్దాం. ఏమీ అనరులే"అని అతన్ని కూడా మెస్ కు తీసుకువెళ్ళారు. తీరా మెస్ కి వెళ్తే, అతను "మీ ఇద్దరికే భోజనం వుంచాను" అన్నాడు."ఫరవాలేదు. ఉన్నదాన్నే మేం సరిపెట్టుకుంటాం లే" అన్నాడు. ఇందులో పెద్ద విశేషం ఏమీలేదు.

కానీ, మర్నాడు కాలేజీలో పెద్ద గొడవ మొదలయ్యింది. "నిన్న మెస్ లో మీతో పాటు భోజనం చేసిన వ్యక్తి బ్రాహ్మణుడు కాదు. మీరు బ్రాహ్మణుడు కాని వాడిని తీసుకువచ్చి, భోజనం పెట్టించారు. అందుకని మీరు క్షమాపణ చెబితే తప్ప, మీతో మాట్లాడం." అని మిగతా కుర్రవాళ్ళంతా ఎదురు తిరిగారు.

చలంగారు బాగా చిన్నతనంలో బ్రాహ్మణులు కాని వారు కనిపిస్తే, భోజనం చేయకుండా లేచి వెళ్ళిపోయేవారు. కానీ, వయసు వచ్చి, ఒకసారి ప్రపంచాన్ని చూడడం మొదలు పెట్టాక, ఈ సంఘటన ఆయనను తీవ్రంగా బాధించింది. 'అతను కూడా మనిషే, ఈ కులం ఏమిటి? కులం ఎక్కడనుండి వచ్చింది? ఈ కులం ఇంత బలంగా ప్రభావాన్ని చూపిస్తున్నదా? మనిషికీ, మనిషికీ మధ్య ఇన్ని అడ్డు గోడలు కడుతున్నదా?' అన్న ఆలోచనలు మొదలయ్యాయి.ఈ సంఘటన జరిగాక, "ససేమిరా.. నేను క్షమాపణ చెప్పేది లేదు. ఒక మనిషికి భోజనం పెట్టాను.మీ కులం అనేది ఎక్కడా నాకు కనిపించలేదు" అన్నారు.

నిజానికి ఆ సమయంలో ప్రిన్సిపాల్ అయిన వెంకట రత్నం నాయుడుగారు కల్పించుకోవాలి. కానీ, ఆయన ఎందుకో కల్పించుకోలేదు. లెక్చరర్లు అందరూ ఏదో సర్దిచెప్పారు. మొత్తానికి కొద్ది రోజులకు సర్దుకుంది. కానీ, ఆ సంఘటన చలం గారి మీద విపరీతమైన ప్రభావం చూపెట్టడమే కాకుండా ' అసలు హిందూ మత గ్రంథాలలో ఏం రాసి వుంది?' అని మతపరమైన గ్రంథాలన్నీ చదివారు. అవన్నీ చదివాక

...'ఈ పూజా పునస్కారాలూ, తద్దినాలూ ఇలాంటి వన్నీ కూడా నిష్ప్రయోజనం.'అని ఒక నిర్ణయానికి వచ్చారు.

అదే సమయంలో ఈ బ్రహ్మ సమాజం యొక్క భావాలు పెరుగుతున్నాయి కదా! దాంతో వెంకట రత్నం నాయుడుని కలసి " మీ బ్రహ్మ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను"అన్నారు. ఆయన చాలా ఆత్మీయంగా, ఆహ్వానించి బ్రహ్మ సమాజం గురించి మరింతగా వివరించారు.

విగ్రహాలకి పూజలు చెయ్యకూడదు. ఆలయాల్లోకి వెళ్ళకూడదు. కుల బేధాలు పాటించ కూడదు. ఇలాంటి వన్నీ ఆయనకు బాగా నచ్చి, బ్రహ్మ సమాజంలో క్రియాశీలకమైన పాత్ర పోషించడం మొదలుపెట్టారు. ఇక ప్రతిరోజూ వెంకట రత్నం నాయుడు గారి ఉపన్యాసాలు వినడం, ఏకేశ్వరోపాసన ప్రార్ధనలలో పాల్గొనడం, ఇలాంటివన్నీ కాకినాడలో ప్రారభించడమే కాకుండా, ఆయన శెలవులకు ఇంటికి వెళ్ళినపుడు కూడా, ఇంట్లో వాళ్లకి కూడా ఈ బ్రహ్మ సమాజం మూల సూత్రాలు చెప్పేవాడు, వాటిని అనుసరించడం వలన కలిగే లాభాల గురించి పెద్దవాళ్ళకి కూడా చెప్పాడు. చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ చలం గారిని సమర్ధించారు గానీ, పెద్దవాళ్ళకి నచ్చలేదు. వాళ్ళ నాన్నగారికి అసలు నచ్చలేదు. వాళ్ళ తాత గారికి తెలిసింది గానీ, అతను ఏమీ అనలేదు. చలంగారు మాత్రం చాలా దూకుడుగా, ఉధృతంగా ప్రచారం చెయ్యడం మొదలుపెట్టారు. అప్పటికి ఆయనకు 17 సంవత్సరాలు మాత్రమే.

అంతే కాకుండా ఆయన ఇంకో పని ఏం చేశారంటే..సెలవులకి తెనాలి వచ్చినపుడు, భార్య ఇంకా తెనాలిలోనే వున్నారు కదా. ఆమె ఇంట్లో పనులన్నీ చెయ్యడం చూసి ఇంట్లో వాళ్ళని అడిగారు "అవును మీరందరూ వున్నారు కదా! ఆమెతోనే ఎందుకు చేయిస్తున్నారు?"అని. దానికి వాళ్ళు"ఇంటి కోడలు కదా! ఇంట్లో పనులు చెయ్యాలి. చేస్తే తప్పేముంది? "అన్నారు. అందుకు భార్య రంగనాయకమ్మ గారిని పిలిచి " చూడూ! నువ్వు ఒక పని చెయ్యి.నీకేమైనా పని చెబితే..నువ్వెళ్ళి 'మీపనులు మీరే చేసుకోండి బోడి ముండల్లారా'అని తిట్టు. వాళ్ళేమైనా అంటే, నేను చూసుకుంటాను" అని పెద్దవాళ్ళ దగ్గరకు పంపించడమే కాకుండా, వెనకాల తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ పంపించారు.'ఆ మాట అంటుందో లేదో చూసి రమ్మ'ని. ఆమె ఇంకా చిన్న పిల్ల కదా! ఆ మాట అనేసి గబగబా వచ్చేసింది. ఇంట్లో వాళ్లకి కూడా చెప్పారు"కోడలైనంత మాత్రాన అంత చిన్న పిల్లతో ఇంటిల్లిపాదీ పని చేయించు కోవడం మంచిదికాదు."అని. వాళ్ళు కూడా సర్దుకున్నారు.

అంతే కాకుండా,భార్య చిన్న వయసులోనే ఇంటికి వచ్చింది కాబట్టీ, 'ఆమెని విద్యావంతురాల్ని. ఏం చేద్దాం?' అని ఆలోచించే క్రమంలో...'ఎప్పుడూ ఇంట్లోనే వుండడం మంచిదికాదు' అనుకొని, వూరి చివర

ఒక బాడ్మింటన్ కోర్ట్ తయారు చేయించి, చెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనీ  తీసుకొని బేట్లు పట్టుకొని వెళ్తుండేవారు. వూర్లో వాళ్ళందరూ విచిత్రంగా చూస్తుండేవారు. ఎందుకంటే, అసలు ఆడవాళ్ళు బయటకు రావడమే గగనం. అందులోనూ భార్యాభర్తలు అంత చిన్న వయసులో బేట్లు పట్టుకొని వెళ్ళడం మరీ విచిత్రం. కొన్ని రోజులు అలా చూశారు.ఆ తరువాత వీళ్ళను ఆక్షేపించడం ప్రారంభించారు. చలంగారు ఏమీ పట్టించుకోలేదు. మరికొంత ముందుకు వెళ్లి, "చలం కులభేదాలు పాటించడం లేదు." అని తిట్టడమే కాకుండా, ఉమ్ము కూడా వేసేవారట. ఏమైనా సరే దేనికీ అదరలేదు. బెదర లేదు. తానూ అనుకున్న బ్రహ్మ సమాజ సూత్రాలు పాటించడం, వాటిని ప్రచారం చెయ్యడం, అలాగే బాడ్మింటన్ కు వెళ్ళడం మానలేదు.

ఇంకా కాకినాడలో చదివే రోజుల్లోనే జరిగిన మరో రెండు సంఘటనలు ఆయన బ్రహ్మ సమాజం లోనే కొనసాగడానికి కారణం అయ్యాయి. అవేమిటంటే, ఒకటి: కాకినాడలో చదువుకునే రోజుల్లోనే వాళ్ళ అత్తగారు చనిపోయారు. ఆమె బందరులో చనిపోతే, అక్కడకు వెళ్లారు. అప్పుడు చలం గారితో పాటు, ఆయన మిత్రుడు ప్రకాశరావు కూడా వెళ్ళాడు.  చలంగారు ఎక్కడకు వెళ్ళినా అతను వెంట ఉండేవాడు. ఇద్దరూ కలసి అక్కడకు వెళ్లేసరికి ఆ ఇంట్లో కర్మ కాండలు జరుగుతున్నాయి. ఇంటల్లుడికి భోజనం పెట్టాలి కదా! ఆ ఇంట్లో వాళ్ళు వీళ్ళిద్దరినీ చూడగానే "వీళ్ళిద్దరూ కులం లేని వాళ్ళు. వీళ్ళకు బయట భోజనం పెట్టండి"అని బయట ఎక్కడో వరండాలో ఎక్కడో విస్తరాకు వేసి భోజనం పెట్టడం ప్రారంభించారు. వీళ్ళకు చాలా అవమానం అనిపించింది.సరే! "ఇంత అవమానంగా ఇక్కడ భోజనం చెయ్యడం ఎందుకు? బయటకు వెళ్లి ఏదైనా హోటల్లో తిందాం"అనుకోని బందరు ఊరంతా తిరిగారు. మిట్ట మధ్యాన్నం..ఏ హోటల్ కి వెళ్ళినా గానీ, మరి ఆ రోజుల్లో అడిగేవారేమో! "మీరు కులం లేని వాళ్ళు. మీకు భోజనం పెట్టం." అన్నారు. దాంతోటి వెనక్కి వచ్చేసి, ఆకలి భరించలేక, ఇంట్లోకే వెళ్లారు. ఆ ఇంట్లో భోజనం చేస్తున్న వాళ్ళంతా, ఇళ్ళు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. కులభావన అంత తీవ్రంగా వుండేది ఆ రోజుల్లో.

వాళ్ళ అత్తగారు చనిపోయిన సందర్భంలో అలాంటి దారుణమైన  సంఘటన జరిగింది. తిరిగి వెళ్ళేటప్పుడో, వచ్చేటప్పుడో రైల్వే స్టేషన్లో భోజనం చేయడానికి వెళ్తే, చలంగారు భోజనం చేస్తుండగా తెలిసిందట' ఈయన కులం లేనివాడు' అని.అక్కడ మిగతా భోంచేస్తున్న వాళ్ళు కూడా లేచి వెళ్లి పోయారట. దాంతో ఆ రైల్వే రెస్టారెంట్ ఓనర్ వచ్చి, "వాళ్ళంతా డబ్బులు ఇవ్వకుండా వెళ్ళిపోయారు.వాళ్ళ డబ్బులు కూడా నువ్వే కట్టాలి"  సరే! పక్కన మిత్రుడు కూడా వున్నాడు కదా! ఇద్దరూ

కలసి ఏదో వాదించారు. ఎలాగో బయటపడ్డారు. ఇలాంటి సంఘటనలన్నీ కూడా చలంగారిలో వున్న తీవ్రవాద గుణాలు గానీ, పోరాట పటిమనుగానీ, ఇంకా ఇంకా పెంచాయి అనుకోవచ్చు.

ఇవన్నీ కూడా వాళ్ళ తాత గారికి తెలుస్తున్నాయి. 'ఇదేమిటి..వీడు ఇప్పుడే ఇలా తయారవుతున్నాడు. ' ఒక్కడే దేవుడు. విగ్రహారాధన చెయ్యను. అంటున్నాడు.రేప్పొద్దున్న నేనేమైనా అయితే ఎలా?అసలు వీడిని దత్తత తీసుకున్నదే కర్మ కాండలు చేస్తాడని. అసలు అవన్నీ చేస్తాడా? ' అని దిగులు పట్టుకుంది గానీ, చలం గారిని ఏమీ అనలేదు.

ఈ విధంగా ఆ బ్రహ్మ సమాజం ప్రభావంతో కాకినాడలో ఎఫ్.ఎ. చదువుకున్నారు. భార్య రంగనాయకమ్మ ఇంకా తెనాలిలోనే వున్నారు. ఈ రెండు సంవత్సరాలూ అయిపోయాక, ఇంట్లో వాళ్ళు కాస్త స్థిమిత పడ్డారు. పోనీలే కాకినాడ నుండి వచ్చేశాడు. ఇప్పుడైనా బాగుపడతాడని. అక్కడనుండి బి.ఎ. చదవడానికి మద్రాస్ పంపించారు. ముందు ఆయన ఒక్కడే వెళ్లి కాలేజీలో చేరారు. భార్యని పంపలేదు. కాకపోతే,ఆయన మద్రాస్ లో చదువు ప్రారంభించాక, అక్కడ అందరినీ చూసి, భార్యకి కూడా చదువు వుంటే బాగుంటుంది. తనతో పాటు చదువు చెప్పిస్తే బాగుంటుంది అనుకొని, ఇంట్లో వాళ్లకు ఉత్తరాలు రాయడం ప్రారంభించారు.

“మా చిట్టి గారిని పంపించండి. నేను ఇక్కడే చదువు చెప్పించుకుంటాను.”అని. ఇంట్లో వాళ్ళు ఆశ్చర్యపోయారు. ”అదేమిటి? అమ్మాయిని తీసుకువెళ్ళడం ఏమిటి? చదువు చెప్పించడం ఏమిటి?” ససేమిరా...పంపించం అన్నారు. ఉత్తరాలు రాసి...రాసి..ఇలా కుదరడం లేదని చెప్పి, ఒకసారి ఇంటికి వచ్చినపుడు వాళ్ళతో గట్టిగా చెప్పాడు. “ఏమైనా సరే! నేను తీసుకువెళతాను.హాస్టల్ లో వుంచి చదివిస్తాను.”అని. హాస్టల్ అనేసరికి వాళ్ళు మరింత వ్యతిరేకించారు. “పోనీ ఒకపని చేస్తాం మేం ఇద్దరమూ కలసి ఒక రూము తీసుకుంటాం. మీరు నెలకి ఒక ఇరవై రూపాయలు పంపించండి. చాలు” అన్నారు చలంగారు

“అసలు చదువు చెప్పించడానికీ వీలు లేదూ, అమ్మాయిని తీసుకువెళ్ళడానికీ వీలులేదు”అన్నారు పెద్దవాళ్ళు. అంత మాత్రాన వాళ్ళ మాటలు వింటే, చలం గారు ఎందుకవుతారు?

ఆయన “ఏమైనా సరే! తీసుకువెళ్తాను.డబ్బులు ఇవ్వకపోయినా పర్వాలేదు. ఎలాగోలా బతుకుతాం”అని మొండి కేసి, ఒక రోజు రాత్రి అందరూ నిద్రపోతున్న సమయంలో భార్యను ప్రయాణానికి సిద్దం చేసారు.అప్పుడు జరిగినటువంటి సంఘటన ఆయన మాటల్లోనే....

"నేను రాత్రి బయలుదేరాలి. "నువ్వు అమ్మాయిని చదివించినట్లయితే డబ్బులు ఇవ్వం. " అన్నారు. తాత గారు కూడా. అర్ధరాత్రయ్యింది. బండి వచ్చి వాకిట్లో నిలుచుంది. నా దగ్గర డబ్బు ఏమీలేదు. ఎక్కడికి పోతానో, ఏం చేస్తానో తెలీదు. ఇల్లంతా నిద్రపోతోంది. "వెళుతున్నాను"అని చెప్పడానికి తాతగారి గదిలోకి వెళ్ళాను.ఆ పెద్ద గదిలో పెద్ద మంచంమీద నిద్రపోతున్నారు. ఆయనవీపు వెనకాలే నేను నిలుచుని "తాత గారు మేము వూరికి వెళ్తున్నాము"అన్నాను. మాట్లాడకుండా, ఒక చేత్తో దగ్గరకు లాక్కొని గట్టిగా అదుముకొని, కౌగిలించుకున్నారు. ఏమీ మాట్లాడకుండా కన్నీళ్లు కార్చారు. ఈనాడు తెలుస్తున్నది నాకు. ఆయనకు నామీద యెంత ప్రేమో. ఆయన హృదయమూ, మనసూ యెంత విశాలమో. ఆయనలో యెంత క్షమో. ఆయన నన్ను వదలిన తర్వాత నేను లేచి నిలుచున్నాను. నా చేతిలో ఒక నోట్ల కట్ట పెట్టి, ఒక్క మాట లేకుండా తిరిగిపడుకున్నారు. నేను గద్గద కంఠంతో "నేను వెళుతున్నాను తాతగారు"అని వచ్చేశాను. బహుశా తాత గారిని చూడడం అదే చివరిసారి అనుకుంటాను"

మద్రాస్ వచ్చేశారు. హాస్టల్ లో కాకుండా ఒక గది తీసుకున్నారు. భార్యను కాన్వెంట్ లో చేర్పించారు. ఆమె స్కూలుకి వెళుతుండేది. చలంగారు కాలేజీకి వెళ్తున్నారు. వాళ్ళిద్దరూ అలా కాపురం పెట్టి, చదువుకుంటున్న రోజుల్లో మరొక సంఘటన జరిగింది. ఈ సంఘటనలన్నీ కూడా ఇంత వివరంగా చెప్పడానికి కారణం...చలంగారు తరవాత రోజుల్లో రాసినటు వంటి సాహిత్యానికి పునాదులు ఏమైనా ఉన్నాయా? ఎలాంటి సంఘటనలు ఆయన్ని బాధించాయి?అనే ప్రశ్నలు వేసుకున్నాం కదా! వాటికి సమాధానమే ఈ సంఘటనలన్నీ. ఇవన్నీ తెలుసుకుంటేనే , ఆడవాళ్ళ గురించి ఆయన ఎందుకంతగా కన్నీరు కార్చారో బోధపడుతుంది. ఆ సంఘటన ఏమిటంటే...

చిన్నప్పుడు అంటే, ఈ సంఘటన జరగడానికి 4,5, సంవత్సరాల ముందు, వాళ్ళ చెల్లెలికి బలవంతంగా పెళ్లి చేశారని అనుకున్నాం కదా! ఆ చెల్లెలు అన్నగారికి ఉత్తరాలు రాయడం ప్రారంభించింది. "అన్నయ్యా! నన్ను అత్తగారింట్లో బాగా ఇబ్బందిలు పెడుతున్నారు.నేను భరించలేకపోతున్నాను.ఏం చెయ్యాలో తెలియడం లేదు.ఏవైనా సలహా చెబుతావేమోనని రాశాను." అని. సరే! చలం గారు "నువ్వు అలా చెయ్యి, ఇలా చెయ్యి, భయపడొద్దూ, లేకపోతే వాళ్ళని ఎదిరించు" ఇలా ఏవో సలహాలు చెబుతూ వుత్తరాలు రాశారు. ఆ ఉత్తరాల్లో కొన్ని వాళ్ళ అత్తవారి ఇంట్లో వాళ్ళ కంట్లో పడ్డాయి. దాంతోటి వాళ్ళు "ఇక పై మీ అన్నయ్యకు ఉత్తరాలు రాయడానికి వీలులేదు "అన్నారు.

చాలా రోజుల పాటు చెల్లెలు దగ్గర నుండి ఉత్తరాలు రావడం ఆగిపోయాయి. ఎందుకో అర్థం కాలేదు.ఈ లోగా పోస్టల్ లో "టు–బి పైడ్" అని ఒక పద్దతి వచ్చింది. పోస్ట్ చెయ్యడానికి కూడా డబ్బులు

లేక, అత్తవారికి కూడా భయపడి, ఏదో చిత్తు కాగితం తీసుకొని, దానిమీద రాసేసి పోస్ట్ లో పడేసింది. చలంగారు అవన్నీ చూసి బాధపడి, ఇంటికి అంటే తెనాలి వుత్తరం రాశారు. "మీరు అర్జంటుగా చెల్లెలు దగ్గరకు వెళ్లి, వాళ్ళ అత్త గారి ఇంటినుండి తీసుకువచ్చేయండి. అక్కడ చాలా ఇబ్బందులు పడుతోంది.ఒకవేళ మీరు తీసుకురాక పోతే, నాకు బ్రహ్మ సమాజం తాలుకా సపోర్ట్ వుంది.నేను వెళ్లి తీసుకువచ్చేసి, క్రిస్టియన్ హాస్టల్ లో జాయిన్ చేసేస్తాను."అని వుత్తరం రాశారు.

ఆ విషయంఎలాగో వాళ్ళ బావ గారికి తెలిసింది. దాంతోటి 'బావ మరిది అన్నంత పనీ చేస్తాడని' మనసులో అనుకొని ఆమెను బాగా చూసుకోవడం ప్రారంభించాడు. ఆ విషయం చెల్లెలు అన్నయ్యకు రాసింది. "అన్నయ్యా! ఫరవాలేదు. నువ్వు బెదిరించిన తరవాత నన్ను బాగానే చూసుకుంటున్నారు."అని. అంత వరకూ బాగానే వుంది. ఆ తర్వాత ఆ చెల్లెలు భర్తతో చెప్పిందట " అవునండీ!మీరు గనక మారకపోతే, మా అన్నయ్య నన్ను తీసుకు పోయేవాడేమో! నేను కూడా ఆ క్రిస్టియన్లలో కలిపేసే వాడేమో! మీరు యెంత మంచి పని చేశారు"అని భర్తనే పొగిడిందట. దానికి చలంగారు "చూడండి..ఆడవాళ్ళు తిట్టినా, కొట్టినా భర్తంటే యెంత ప్రేమో, భర్త వెనకాతలే వుంటారు.అన్ని బాధలు పడినా గానీ" అనుకున్నారు.

మద్రాస్ లో చదువుకుంటుండగానే 1913,14 ప్రాంతాల్లో వాళ్లకి కొడుకు పుట్టాడు. ఆ కొడుక్కి "రవి" అని పేరు పెట్టుకున్నారు. ఆ కొడుకు పుట్టిన కొద్ది నెలలు అటు, ఇటుగా వాళ్ళ తాతగారు మరణించారు. తాతగారు మరణించిన తరువాత కాకినాడ వెళ్లి, ఆయన కోరిక మేరకు అన్ని కార్యక్రమాలూ సాంప్రదాయ బద్ధంగా చేశారు. "తాతగారు నన్ను దత్తత చేసుకున్నందుకు ఆయనకు మనశ్శాంతి వుండాలి.చనిపోయాక కూడా ఆత్మ వుంటుందో, లేదో నాకు నమ్మకం లేదు గానీ, ఆయన నమ్మకాన్ని పాటించాలి. అనుకొని అన్ని కార్యక్రమాలు చేశాను. అదే చివరిసారి. సాంప్రదాయాలతో బంధం తెగిపోయింది. ఆ కార్యక్రమం పూర్తయ్యాక" అని రాసుకున్నారు. కానీ, ఆతరువాత 40 సంవత్సరాలకి అరుణాచలం వెళ్ళాక, ప్రార్ధనలూ, పూజలూ ప్రారంభించారు. అదంతా వేరే కథ, చివరలో వస్తుంది.

మద్రాస్ లో భార్య స్కూలుకి వెళ్ళినపుడు కొడుకుని తను పెంచుతూ, తను కాలేజీకి వెళ్ళినపుడు ఆమె చూసుకోవడం ఇలా ఆ సహచర్యం తో కొడుకంటే విపరీతమైన ప్రేమ. వాళ్ళిద్దరి మధ్యా అనుబంధం చాలా చిన్న తనం నుండే మొదలయ్యింది. ఆ తరువాత కూడా కొనసాగింది.

ఇంత వరకూ మనం చలంగారిని ప్రభావితం చేసినటు వంటి సంఘటనలూ, బ్రహ్మ సమాజం, ఆడపిల్లల్ని ప్రేమించడం ఇలాంటివన్నీ చెప్పుకుంటున్నాం కానీ, ఆయన ఏమైనా కథలు ఇలాంటివి ఏమైనా

రాశారా? అన్నది మాట్లాడుకోలేదు. ఈ సమయంలోనే కాదు. ఆ తరువాత 4,5,సంవత్సరాల వరకూ కాల్పనిక సాహిత్యం ఏమీ రాయలేదు. కాకపోతే, మద్రాస్ లో వుండగా “ధర్మ సాధని” అనే పత్రికలో “చెట్టుకీ, తీగకీ సంవాదం” అనే శీర్షికతో ధార్మికమైన విషయాల గురించి వ్యాసాలు రాయడం ప్రారంభించారు. అదే రోజుల్లో బందరు నుండి”కృష్ణా పత్రిక”లో బ్రహ్మ సమాజం గురించి ఏవో వ్యాసాలు వస్తే, వాటిని ఖండిస్తూ, బ్రహ్మ సమాజాన్ని సమర్థిస్తూ వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాలు కూడా గ్రాంధికంలో రాశారు. అవే చలంగారి మొట్టమొదట రచనలు అని చెప్పుకోవచ్చు

మద్రాస్ లో ఉన్నప్పుడే మరో సంఘటన జరిగింది. చలంగారి భార్య పేరు చిట్టి రంగనాయకమ్మ అనుకున్నాం కదా! వదిన రంగనాయకమ్మగారు చెల్లెల్ని చూడ్డానికి మద్రాస్ వచ్చారు. వచ్చిన తరువాత ఇలా చెల్లెల్ని చదివించడం అవీ చూసాక, ”వెంకటచలం నాక్కూడా చదువు చెప్పిస్తావా?”అని అడిగింది. ఆ సంభాషణలో ఆమే చెప్పింది ”నాకు డాక్టర్ చదవాలని వుంది” అని. ఆమె అప్పటికి ఏమీ చదువుకోలేదు. స్కూలుకి వెళ్ళలేదు. ఇంటి దగ్గరే ఏదో రామాయణ భారతాలు తప్పా, మామూలు చదువు ఏమీ చదువుకోలేదు. ఇటు చలంగారు బి.ఎ చదువుతున్నారు గానీ, తర్వాత ఎలా బతుకుతారో ఏమిటో అతనికి కూడా తెలియదు.అలాంటి రోజుల్లో ఆ వదిన గారు తనని “నాకు డాక్టర్ చదవాలి వుంది”అని అడిగిన ఆ క్షణం గురించి ఆయన రాస్తూ...”ఆ వదిన గారు కన్నటువంటి కల నిజమయ్యింది”

ఆ కల నిజం చేశారు చలంగారు.!! ఆ తరువాత ఇరవై సంవత్సరాల పాటు చలం గారి కుటుంబం మొత్తానికి ఆ వదిన గారే ఆర్ధిక బలం అయ్యారు. ఆమె డాక్టర్ అయ్యాక ఆమెకు వచ్చిన ప్రశస్తీ, పేరూ విజయవాడలో ఎలా ఉండేదంటే.. ”ఆమె చిన్ని చేతుల మీదుగా ఎంతోమంది దిక్కులేని స్త్రీలూ, ఆపదలో వున్న వాళ్ళూ ఓదార్పు కోసం తపించేవరూ, నాకో తల్లి ఉండదా అని ఏడ్చేవారూ ఈ లోకంలో ఎక్కడా దిక్కు అనేది లేని దీనులూ, సంఘ బహిష్కృతులూ,తల్లుల్ని వదలి వచ్చిన పిల్లలూ, నన్ను తీసుకోమని గర్భంలోనే చేతులు చాచే శిశువులూ, యెంత సంతోషంలో వారి జీవితాలు గొప్ప ఫుల్ ఫిల్ మెంట్ జరిగినట్లు త్రుప్తి పడ్డారో.” ఇన్ని పనులు చేశారు ఆ వదిన రంగనాయకమ్మగారు డాక్టర్ అయ్యాక.

B.A. చదువు కూడా కాస్త అటూ ఇటూగా సాగుతుండేది. కొడుకుని పెంచడం, భార్యను స్కూలుకి పంపించడం, వీటి మధ్య ఎలాగో కష్ట పడి B.A. పూర్తి పూర్తయిన తరువాత భార్యనీ, కొడుకునీ తీసుకొని తెనాలి వచ్చేశారు. వదిన గారు వాళ్ళతో రాలేదు. ఆమె బెజవాడ వెళ్ళిపోయారు. తెనాలి వచ్చిన తరువాత తెలిసింది. తాతగారు ఇచ్చిన ఆస్తినంతా వాళ్ళ నాన్నగారు నెమ్మది నెమ్మదిగా స్వాహ చేస్తున్నారని. స్వాహ చెయ్యడమే కాకుండా వాళ్ళ అమ్మద్వారా చలాన్ని అడిగిస్తున్నారు. మిగతా ఆస్తిని కూడా అమ్మడానికి

చలంగారిని సంతకం పెట్టమని. అసలు దేన్నీ ఏమీ పట్టించుకునే వ్యక్తి కాదేమో, ఐహిక సుఖాల మీద ఆసక్తి లేదు అనుకోవడానికి ఇదొక ఉదాహరణ. వాళ్ళ అమ్మగారు అడిగినప్పుడల్లా సంతకాలు పెట్టడం. అలా వాళ్ళ నాన్న గారు ఆస్తి నంతా అమ్మేయ్యడం జరిగింది. అటు మామగారి వైపు నుండి చూస్తే అటు కూడా అలాగే జరిగింది. మామగారు, అత్తగారు చనిపోయాక మరో వివాహం చేసుకున్నారు. ఆ మరో అత్తగారికి చేసుకున్నాక మరిన్ని సమస్యలు వాళ్ళ ఇంట్లో. అందువల్ల అటునుండి కూడా ఏమీ ఆస్తిరాలేదు.

మొత్తానికి చలంగారికి B.A. చదువుకున్నా గానీ, రెండు వైపులా ఆస్తి వున్న వాళ్ళే గానీ, ఏమీ లేని నిరుపేదలయ్యారు. ఇక వుద్యోగం చేసి తీరాల్సిన పరిస్థితి వచ్చింది. ఇల్లు గడవాలంటే ఏం చేద్దాం? అని అనుకుంటున్న రోజుల్లో కాకినాడ రఘుపతి వెంకట రత్నం నాయుడుగారి నుండి వుత్తరం వచ్చింది. “ఒరే! అబ్బాయ్! నువ్వు B.A. చదువుకున్నావు కదా! ఖాళీగా వున్నావని తెలిసింది. నువ్వు నాదగ్గరకు వచ్చేసేయ్! కాలేజీలో నీకు ‘ట్యూటర్’ వుద్యోగం ఇప్పిస్తాను”అని.

ఆ విధంగా మళ్ళీ మూడు సంవత్సరాల తర్వాత కాకినాడలో అడుగుపెట్టారు. కాలేజీలో ‘ట్యూటర్’ వుద్యోగం అంటే ఏమిటి? రెండో, మూడో క్లాసులకు హాజరు పట్టీ వేసుకోవడం అంతే. పెద్దగా క్లాసులు చెప్పాల్సిన పని కూడా లేదు. వెంకట రత్నం నాయుడుగారు కూడా చలాన్ని పిలవడానికి కారణం, అప్పట్లో ఆయన బ్రహ్మ సమాజంలో చురుగ్గా పాల్గొనడం. ఆయన కార్యక్రమాలకు సహాయకుడిగా ఉంటాడనీ, ఏదైనా ఉపాధి చూపించి నట్లు ఉంటుందని. ఆ రెండు మూడు క్లాసులూ హాజరు అయిపోయాక, మిగతా సమయం అంతా ఖాళీయే కదా! దాంతో బ్రహ్మ సమాజం కార్యక్రమాల్లో పాల్గొనే వారు.

ఇలా రెండోసారి కాకినాడ వచ్చాక తన మెడలో వున్న జంధ్యం తీసిపారేశారు. భార్య మెడలో వున్న మంగళ సూత్రం కూడా తీసి పారేశారు. ఇద్దరూ కలసి పూర్తిగా బ్రహ్మ సమాజానికి అంకిత మవ్వడమే కాకుండా ఆవిడ పేరు కూడా ”మాలతీ భాయి”అని మార్చుకున్నారు. చలంగారు యెంత తీవ్రవాదో, ఆమె అంత కన్నా తీవ్రవాది అన్నట్లుగా ప్రచారం చెయ్యడం ప్రారంభించారు. వీళ్ళ ఇల్లు బ్రహ్మ సమాజం కార్యకర్తలకు కార్య క్షేత్రం అయ్యింది. ముఖ్యంగా కులబేధం లేదు కాబట్టి, హరిజనులూ, గిరిజనులూ అని కాకుండా అన్ని కులాల వాళ్ళూ కూడావచ్చేవారు. బ్రహ్మ సమాజం కార్యక్రమాలు ముందుకు తీసుకువెళ్ళడం, వెంకట రత్నం నాయుడు గారి ఉపన్యాసాలు ఇచ్చేటప్పుడు, అక్కడ వెన్ను దన్నుగా నిలవడం లాంటి కార్యక్రమాలన్నీఉండేవి.

చిట్టి రంగనాయకమ్మ గారు ఇంకా ఏం చేశారంటే? ఆమె క్రైస్తవ మత ప్రచారకుల్లాగా, ఇంటింటికీ వెళ్లి, స్త్రీ లందరికీ కూడా బ్రహ్మ సమాజం యొక్క నమ్మకాల్ని ప్రచారం చేస్తుండేవారు. ఆమె ప్రవేశించే

వరకూ బ్రహ్మ సమాజం గురించి స్త్రీలు ప్రచారం చేయడం లేదు. అంతే కాకుండా ఈ బ్రహ్మ సమాజం వాళ్ళు నమ్మే "ఏకేశ్వరోపాసన" ప్రార్ధనలు కూడా సాయంకాలం పూట నగర సంకీర్తన లాగ బయలుదేరి, వాటిని పాడుతూ, కాకినాడ వీధుల్లో తిరుగుతుండేవారు. వీటన్నిటికీ కేంద్ర బిందువు చలం గారు.

రఘుపతి వెంకట రత్నం నాయుడు గారు బ్రహ్మ సమాజం కాకినాడ బ్రాంచికి ప్రెసిడెంట్ అయితే, చలం గారు సెక్రటరీ. ఆయన సెక్రటరీ వున్నప్పుడు కేవలం నాయుడు గారు చెప్పిన పనులే కాకుండా, ఆయన స్వయంగా ప్రారంభించిన కొత్త కార్యక్రమాలు ఏమిటంటే...అప్పటివరకూ బ్రహ్మ సమాజంలో రెండు రకాల సభ్యులు వుండేవారు. కొంతమంది క్రియాశీలక సభ్యులూ, మరి కొంతమంది సానుభూతి పరులు. ఈ సానుభూతి పరులు ఎందుకున్నారు? వెంకట రత్నం నాయుడు గారికి అనుకూలంగా వుంటే, పిఠాపురం రాజా వారికి సంబంధించిన పనులు అవుతాయని వాళ్ళు వుండేవారు.

అయితే చలం గారు "ఈ సానుభూతి పరులు మాకు అక్కరలేదు. వుంటే, క్రియా శీలక సభ్యులుగా వుండండి. లేకపోతే లేదు." అనడంతో వాళ్ళు కూడా క్రియాశీల సభ్యులుగా మారారు. అంతే కాకుండా వీళ్ళు వనభోజనాలు అలాంటివి చేస్తున్నప్పుడు వున్నా వాళ్ళూ, లేని వాళ్ళూ అనే తేడా ఉండేదట "అదికూడా వుండకూడదు. మనం ఇన్ని నీతులు చెబుతున్నాము. కులబేధాలు వద్దు అనుకుంటున్నప్పుడు ఆర్ధిక వ్యత్యాసాలు మాత్రం ఎందుకు?" అని అందరినీ ఒకే పంక్తిలో భోజనం చేయించేవారు. అంటే, నాయుడు గారు ప్రారంభించిన కార్యక్రమాలన్ని మరికొంచెం ముందుకు తీసుకువెళ్ళారు.

ఆ రోజుల్లోనే జరిగిన మరో మార్పు ఏమిటంటే... వెంకట రత్నం నాయుడు గారు అప్పుడే ఆవిర్భవించిన "జస్టిస్ పార్టీ "లో చేరారు. అది చలంగారికి నచ్చలేదు. "మీరు రాజకీయాల్లో చేరడం ఏమిటి? మనం ఈ బ్రహ్మ సమాజంలో మాట్లడుకునేదేమిటి?"అని ఆ బ్రహ్మ సమాజంలోనుండి బయటకు వచ్చి, "అంధ్రా బ్రహ్మ సమాజం"అని కొత్తగా స్థాపించి, అందులో కొనసాగారు. కానీ, అంత తీవ్రంగా పని చేస్తున్న చలం గారిని,ఆ ఆంధ్రా బ్రహ్మ సమాజం లోనుండి కూడా వెలివేసారు. దానికి కారణం ఒక స్త్రీ. ఆ స్త్రీ ఎవరు? ఆమె చలం గారి జీవితాన్ని ఎలా అల్లకల్లోలం చేసింది.ఆ స్త్రీ యే చలం గారి శశిరేఖకూ, మైదానానికీ ప్రేరణ అయివుంటుందా? అసలు ఆ స్త్రీ చలంగారి జీవితంలోకి ఎలా ప్రవేశించింది? తెలుసుకుందాం...

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 ఫిబ్రవరి 25 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS